ఇరుకుతో ఇబ్బందులు

● గార్ల మెయిన్ బజారు రోడ్డును విస్తరించాలని ప్రజల డిమాండ్

గార్ల: గార్లలోని మెయిన్ బజారు రోడ్డు ఇరుకుగా ఉండడంతో, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ బజారులో వ్యాపార సముదాయానికి సంబంధించిన దుకాణాలు ఎక్కువగా ఉండడంతో రోడ్డు ఎప్పుడూ ప్రజలతో రద్దీగా ఉంటుంది. ఈ బజారులో ఎదురెదురుగా 2 ఆటోలు, ట్రాలీ ఆటోలు వస్తే మాత్రం ఇరుకుగా ఉన్న రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతుంటారు. రోడ్డు కేవలం 10నుంచి 12ఫీట్లు మాత్రమే ఉండడం వలన వాహనదారులు వెనక్కి, ముందుకు వెళ్తూ పడరాని పాట్లు పడుతుంటారు. ఈ రోడ్డును విస్తరించాలని పలుమార్లు మండల ప్రజలు సంబంధిత అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాహనదారులు పేర్కొంటున్నారు. ఈ బజారులోనే కిరాణం,


ఇరుకు రోడ్డులో వెళ్ల లేక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఎరువుల దుకాణాలు, ఫ్యాన్సీ, క్లాత్ స్టోర్స్ ఉండటం వలన మండల ప్రజలు నిత్యావసరాలను తీర్చుకునేందుకు మండల కేంద్రమైన గార్లకు వస్తుంటారు. అసలే ఇరుకు రోడ్డు అంటే దుకాణాల ఎదుట వాహనాలు నిలపడంతో, ఈ రోడ్డు ద్వారా వెళ్లే వాహనదారులు, కార్లు ఈ రోడ్డు నుంచి బయటికి వెళ్లాలంటే నానా అగచాట్లు పడుతుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దుకాణాల ఎదుట వాహనాలు నిలుపకుండా ఉండేందుకు వాహనదారులకు పార్కింగ్ సౌకర్యం కల్పించి, ఈ రోడ్డును వెడల్పు చేసే ప్రక్రియ ప్రారంభించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డును విస్తరించాలి



పట్టణంలోని మెయిన్ బజారులో రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు ఈ రోడ్డుగుండా వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. వ్యాపార సముదాయం అయిన ఈ బజారులోని దుకాణాల్లో కొనుగోలు చేసేందుకు నిత్యం వందలాది మంది ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోల ద్వారావస్తుంటారు. రహదారిని విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- గిన్నారపు రామారావు, గార్ల

వక్ఫ్ బిల్లుతో ముస్లింలకు తీవ్రనష్టం

మహబూబాబాద్ అర్బన్: వక్ఫ్ బిల్లు రద్దు చేయడమంటే ముస్లింల మనోభావాలను దెబ్బతీయడమేనని తెలంగాణ ఉద్యమ జేఏసీ చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకర బోర్డు ఉర్దూ ఘర్ షాదీఖానాలో ఆదివారం వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రద్దు-పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఎక్బాల్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ ఉద్యమ జేఏసీ చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వక్ఫ్ చట్టంలో ముస్లిమేతర సభ్యులను ఎలా చేరుస్తారని ఆయన ప్రశ్నించారు. వక్ఫ్ బిల్లుతో ముస్లింలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పీరయ్య, సుధాకర్, భీమానాయక్, సంజీవరావు, ఉపేంద్రం, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డోలి సత్యనారాయణ

దరఖాస్తు చేసుకోవాలి

మరిపెడ: తెలంగాణ గిరిజన గురుకుల సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంపీ లక్ష్మీ ప్రసన్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్లగడ్డతండా స్టేజీ డిగ్రీ కళాశాలలో బీస్సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్సీ, బీకాం(జనరల్), బీకాం(సీఏ) ఎంబీజెడ్సీ, బీఏ(హెచ్ఈపీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 81798 89528 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

ఆదివాసీ తెగల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: రాష్ట్రంలో ఆదివాసీ తెగల అభివృద్ధి కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గిరిజన ఆదివాసీ చట్టాలపై అవగాహన, వారిని అన్నిరంగాలలో అభివృద్ధి చేయడం కోసం, రాష్ట్రంలో రాజ్యాంగపరమైన హక్కులను, విధులను ప్రభుత్వ సంస్థలలో వారి వాటాలను తెలియపరుచుటకుగాను శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారన్నారు. ఈనెల 19, 20, 21 తేదీల్లో మూడు రోజులపాటు హన్మకొండ హరిత హోటల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. గిరిజన సంస్కృతి, విద్య, వైద్య, ఆరోగ్య, అటవీ హక్కులు, రిజర్వేషన్, కాంగ్రెస్ పార్టీ వివిధ సంస్థల మేథావులు పాల్గొని గిరిజన జాతి అభివృద్ధిపై దిశా నిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్, జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ బోడ రవినాయక్, పట్టణ ఎస్టీ సెల్ చైర్మన్ తేజావత్ శంకర్ నాయక్, వాంకుడోత్ కొమ్ములు, భూక్య పద్మ, భూక్య రవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నర్సింహులపేట: జెడ్పీ హైస్కూల్‌లో 1986-87 బ్యాచ్ విద్యార్థులు


మరిపెడ: సిద్ధార్థ హైస్కూల్‌లో 1998-2000 బ్యాచ్ విద్యార్థులు


దోర్నకల్: పెరుమాళ్ల సంకీస జెడ్పీహెచ్ఎస్‌లో..


కేసముద్రం విలేజ్ జెడ్పీహైస్కూల్‌లో..

దోర్నకల్: మండలంలోని పెరుమాళ్ల సంకీస గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం 1999-2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. డోర్నకల్ రైల్వే హైస్కూల్‌లో 2004-05 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 1986-87 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం చదువుకున్న పాఠశాలలో కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులు దాసరోజు వెంకటేశ్వరస్వామి, దాసరోజు దక్షిణమూర్తి, కొండారెడ్డి, లచ్చిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, అలువాల రవి, ఈరగాని భిక్షం, దుబాకుల వెంకన్న, ఎరనాగి వెంకన్న, సుల్తానా బేగం, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ: మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్ 1998-1999-2000 మూడు బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కాలం రవీందర్‌రెడ్డి, కాలం శ్రీనివాస్‌రెడ్డి, సునీత, విద్యాసాగర్‌రెడ్డి, పూసపాటి విజయ్‌కుమార్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం విలేజి జెడ్పీహైస్కూల్‌లో 1999-2000 ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి, బద్రినారాయణ, మోహన్‌రావు, నరేందర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మగూడెం విద్యాభారతి గురుకుల పాఠశాలలో ఆదివారం 2007-08 సంవత్సరంలో పదో తరగతికి చెందిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి


మాట్లాడుతున్న పెరుగు కుమార్

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డును సీపీఐ బృందం ఆదివారం పర్యటించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డుల్లో భగీరథ పైపులైన్లు వేయాలని, కాలనీల్లో ఉన్న బావులను పునరుద్ధరించి వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. శివారు కాలనీల్లో భగీరథ పైపులైన్లు లేవని, మంచినీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వేసవికాలం దృష్ట్యా మంచినీటి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో రేషపల్లి నవీన్, ఎండి.ఫాతిమా, మామిండ్ల సాంబలక్ష్మీ, నాంచారి దాసు, మైస శ్రీనివాస్, ఎండీ షంషీర్, శ్రీను, నర్సయ్య, గౌస్, మహేందర్, నరేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

మహబూబాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలే కాంగ్రెస్ ప్రభుత్వం పేరు మార్చి అందిస్తుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్ అన్నారు. గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆదివారం సలార్ తండాలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల నర్సింహారెడ్డి, గద్దం అశోక్, శ్యామ్‌సుందర్ శర్మ, బూత్ అధ్యక్షుడు శంకర్‌నాయక్ పాల్గొన్నారు. ఈనెల 14నుంచి 25వరకు అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జర్పుల కల్యాణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యుడు రామచంద్రావు, గిరిజన అధ్యక్షులు రాంబాబునాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అజయ్

ఘనంగా మట్టల ఆదివారం


మహబూబాబాద్ రూరల్: ఎల్లడ్డాయ్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ప్రదర్శన


గార్ల పురవీధుల్లో మట్టల ప్రదర్శన


దోర్నకల్: ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

గార్ల/దోర్నకల్/మహబూబాబాద్ రూరల్/కురవి/కేసముద్రం: మట్టల ఆదివారం పురస్కరించుకొని క్రైస్తవులు పురవీధుల్లో మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. మానవుల పాప విమోచన కోసం ప్రభువైన యేసుక్రీస్తు శిలువ మరణానికి తనకు తానుగా అప్పగించుకొను రోజును జ్ఞాపకం చేసుకొంటూ ప్రతీఏటా మట్టల ప్రదర్శన నిర్వహిస్తారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: అతివేగంగా వచ్చిన ఓ కారు ఢీకొనగా మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగికి తీవ్రగాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మున్సిపాలిటీలో కాంట్రాక్టు పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న ఇమ్మడి వీరన్న తన ద్విచక్ర వాహనంపై మున్సిపల్ కార్యాలయం వైపునకు వెళ్తున్నాడు. ముకుంద థియేటర్ ప్రాంతంలో కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరన్నకు తీవ్ర గాయాలు కాగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించి, మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు కుమారుడు మధు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రెండు క్వింటాళ్ల పసుపు అపహరణ

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు అనే రైతు తన వ్యవసాయ భూమిలో ఆరబోసుకున్న పసుపులో సుమారు రెండు క్వింటాళ్ల పసుపును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. ఎకరం భూమిలో పండించిన పసుపును ఉడకబెట్టి పదిరోజుల క్రితం వ్యవసాయ భూమిలో ఆరబెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తులు రూ.20వేల విలువైన రెండు క్వింటాళ్ల పసుపును ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

వీల్‌చైర్ అందజేత

పెద్దవంగర: మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో సహస్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ భిక్షంకు ఆదివారం వీల్‌చైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు రాజ్ కుమార్ ప్రతినిధులు ఇమ్మడి రంజిత్, ఆశాలు రజిత, హేమలత పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం సంఘం ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సంజీవ, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, జిల్లా కార్యదర్శులు హుస్సేన్, మంజుల, హరినాయక్ పాల్గొన్నారు.

జలాభిషేకం

దోర్నకల్: దళితుల అభ్యున్నతి కోసం, రాజ్యాంగం అమలు కోసం అంబేడ్కర్ చేసిన సేవలు చరిత్రలో నిలిచాయని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వ్యాస్ లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక రైల్వే కాలనీలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి జలాభిషేకం చేశారు. ఈనెల 11నుంచి 25 వరకు అంబేడ్కర్ సమ్మాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు దేవానాయక్, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం..

కురవి: రాజ్యాంగాన్ని కాపాడుకుందామని మానుకోట మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. ఆదివారం సీరోలు మండలం కొర్లకుంట తండాలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై ఫిర్యాదు

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామ శివారు కంపార్టు నంబర్ 1168లో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా మట్టిని తరలించారు. ఈమేరకు మట్టి తరలింపుపై సంబంధిత అటవీశాఖ అధికారులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై మురళీధర్ రాజు తెలిపారు.

అక్రమంగా ఇసుక రవాణా

చిన్నగూడూరు: మండలంలోని ఆకేరువాగు నుంచి ఆదివారం అక్రమంగా ఇసుక రవాణా ఉగ్గంపల్లి, చిన్నగూడూరు, గుండంరాజుపల్లి, గ్రామాల మీదుగా మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి తరలించారు. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

దంతాలపల్లి: మండల కేంద్రంలో ఓ రైతు విద్యుత్ షాకు పెట్టి ఓ ఎరుకల కుటుంబ జీవనాధారమైన పందులను చంపిన విషయంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నడిగడ్డ శైలజ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు.

చర్య తీసుకోవాలి

దంతాలపల్లి: మండల కేంద్రంలో ఇటీవల విద్యుత్ షాక్‌తో పందులు మృతి చెందిన సంఘటన తెలిసిందే. కాగా ఆదివారం ఎరుకల సంఘం ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు సారంగం, బాధిత కుటుంబ సభ్యులు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ షాకుతో పందులను చంపిన రైతుపై శాఖ పరమైన చర్య తీసుకోవాలని కోరారు.

ఉపాధి కూలి రూ.600 చెల్లించాలి

గార్ల: పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీకి రోజు వేతనం రూ.600 చెల్లించాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన ఏఐకేఎంఎస్ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సక్రు, మనోహర్, రవి, శంకర్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గూడూరు: ఈనెల 15న బయ్యారం మండలం కొత్తపేటలో జరుగు ముక్తార్‌పాష స్థూపావిష్కరణ అనంతరం జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ నాయకుడు గజ్జి లింగన్న తెలిపారు. ఆదివారం సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సన్న బియ్యం పంపిణీ చేసేది కేంద్ర ప్రభుత్వమే

మరిపెడ రూరల్: రాష్ట్ర ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసేది కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర నాయకుడు గాదె రాంబాబు అన్నారు. మండలంలోని చిల్లంచర్ల గ్రామంలో రేషన్‌షాపును రాంబాబు ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలకు మోసం చేసిందన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు న్యాయం

దోర్నకల్: కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కస్నాతండా, పాతదుబ్బతండా, కొత్తదుబ్బతండా తదితర గ్రామాల్లో ఆదివారం జైబాపూ, జై భీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు చిలకబత్తిని మాణిక్యరాజ్, నాయకులు బానోత్ రాజునాయక్, భూక్యా శ్రీనివాస్, లాలూనాయక్, అజ్మీర పర్శానాయక్ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మరిపెడ రూరల్: వేసవిని దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జన వికాస సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర అన్నారు. ఆదివారం మరిపెడ మండలం బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన దుస్స ఉమా భర్త దుస్స శ్రీనివాస్ జ్ఞాపకార్థం జనవికాస ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కురవి: మండలంలోని నేరడ శివారు కాకులబోడు తండా గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మాజీ సర్పంచ్ భర్త కిషన్ నాయక్ కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ పరామర్శించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కురవి ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపాలగిరిలో మాజీ ఎమ్మెల్యే పరామర్శ

తొర్రూరు రూరల్: మండలంలోని గోపాలగిరి గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఎనమాల సమీరా కుటుంబాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం పరామర్శించి, మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు

గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



మరిపెడ రూరల్: మరిపెడ మండలం రాంపురం గ్రామ పాలేరు వాగు ఒడ్డున నూతనంగా నిర్మించిన ఆలయంలో యాదవుల ఆరాధ్య దేవత శ్రీ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శుక్ర, శని, ఆదివారంతో వేదపండితులు బ్రహ్మశ్రీ అప్పె రవిశంకర్ శర్మ మంత్రోచ్చారణల మధ్య జరిగింది. అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకలకు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొమ్ము నరేష్, గాదె అశోక్‌రెడ్డి, రామడుగు అచ్చుత్‌రావు, గుగులోతు వెంకన్న, గుగులోతు రాంబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మంగారి తండాలో నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయానికి ఎంపీ పోరిక బలరాంనాయక్ రూ.20,516, ఎమ్మెల్యే మురళీనాయక్ రూ.20వేల విరాళాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జాటోత్ హరీశ్‌నాయక్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, బాలునాయక్, గుగులోత్ రమేశ్ పాల్గొన్నారు.

వెంకన్నకు డాక్టరేట్



గూడూరు: మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన ఇస్లావత్ వెంకన్న పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషిని గుర్తించిన హర్యానాకు చెందిన మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టర్‌తో సత్కరించింది. విషయం తెల్సుకున్న గ్రామస్తులతోపాటు, ఆయన కుటుంబ సభ్యులు, ఎస్టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు రామన్ననాయక్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేకు ఆత్మీయ సన్మానం

మహబూబాబాద్ రూరల్: అంగరంగ వైభవంగా శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన ఎమ్మెల్యే మురళీనాయక్‌ను కాంగ్రెస్ నాయకుడు శంతన్ రామరాజు ఆదివారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఓం నారాయణలోయ, గురునాథరావు, పద్మం ప్రవీణ్, నాళ్ళ నర్సింహారావు, ఎడ్ల రమేశ్, చలమల్ల నారాయణ, సిరిపురం వీరన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏజీపీ



మహబూబాబాద్ రూరల్: సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా నియామకమైన ఆరెల్లి శ్రీనివాస్ ఆదివారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డిని మర్యాదపూర్వంగా కలిశారు. కార్యక్రమంలో నాయకులు బండోజు ఉపేంద్రాచారి, గార్లపాటి సాయితేజ, బత్తుల యాకాంబ్రం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకుంటాం..

గూడూరు: అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని కోబల్‌తండాకు చెందిన బానోతు హుస్సేన్‌నాయక్ అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆదివారం ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సభను విజయవంతం చేయాలి

తొర్రూరు రూరల్: ఈనెల 27న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరగనున్న రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో కార్యకర్తల సన్నాహక సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాల్లో మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, మాజీ జడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్, నాయకులు అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, నలమాస ప్రమోద్, కుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల ఫీడర్లపై ఎఫ్‌పీఐ ఏర్పాటు

నెహ్రూసెంటర్: విద్యుత్ 33కేవీ, 11కేవీ లైన్లలో బ్రేక్‌డౌన్, సాంకేతిక కారణంగా అంతరాయాలు ఏర్పడితే లైన్ మొత్తం చెక్ చేయకుండా అంతరాయం కలిగిన భాగాన్ని గుర్తించేలా ఫాల్ట్ ఫ్యాసేజ్ ఇండికేటర్ (ఎఫ్‌పీఐ)ను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ జె.నరేష్ ఆదివారం తెలిపారు.

గడువు తేదీని పెంచాలి

గార్ల/బయ్యారం: రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు తేదీని పొడగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఆదివారం గార్లలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కార్యదర్శి సత్యవతి, అంబటి వీరస్వామి, రాజారావు పాల్గొన్నారు.